
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 25 ఆగస్టు 2024



ఈ జర్నీ చాలా సౌకర్యవంతంగా ఉంది



- చిర్ర వెంకటేశ్వర్లు, ప్రభుత్వ టీచర్

ఉరుకులు పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను దుగ్గొండిలో పని చేస్తా. సొంత వాహనం వాడనప్పుడు ఈ సర్వీసులపై ఆధారపడతా. ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే వరంగల్ బస్టేషన్‌కు వెళ్లాలి. నేను పెగడపల్లి డబ్బాల జంక్షన్ వద్ద ఉంటాను. స్కూల్‌కు ఆలస్యం అవుతుందనుకుంటే ఇంటి వద్ద నుంచి ర్యాపిడో సర్వీసులో టూ వీలర్ బుక్ చేసుకుని వెళతాను. రూ.70చార్జీతో సేఫ్‌గా వరంగల్ బస్‌స్టేషన్ చేరుకుంటా. ప్రైవేటు ఆటోలో వెళ్లాలంటే మా ఇంటి నుంచి అర కిలోమీటర్ నడిచి వెళ్లాలి. ర్యాపిడో అయితే బుక్ చేసిన క్షణాల్లో ఇంటి వద్దకు వచ్చి చేరుకుంటుంది. ఈ అవ కాశాన్ని నగరం లోని చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఇప్పుడంతా ఉరుకులపరుగుల జీవితం. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి మళ్లీ నిద్రపోయే వరకు అంతా బిజీబిజీ. ఇక నగర వాసుల గురించైతే చెప్పే పనేలేదు. ప్రతీ క్షణమూ విలువైనదే అన్నట్టుగా వారి దైనందిన జీవితం సాగుతుంది. అలాంటి నగర వాసులు నిత్యం ఎదుర్కొనేది ప్రయాణ ప్రయాస.. ట్రాఫిక్ ఇబ్బందులు. ఈ క్రమంలోనే నగర వాసులకు ముఖ్యంగా అన్ని వర్గాల ఉద్యోగులకు సాంకేతికత బాసటగా నిలుస్తోంది. కొన్ని వాహనరైడ్ యాప్‌లు అందుబాటులోకి రాగా.. ఆ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిమిషాల వ్యవధిలో ఉన్నచోటుకు వచ్చి తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. దీంతో సొంత వాహనాలున్న వారు కూడా ఈ రైడ్స్ పట్ల ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీల్లో మూడు ప్రముఖ సంస్థలు యాప్‌ల ద్వారా సేవలందిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్కువచార్జీకే ఉన్నచోటు నుంచి గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోవడంతో పాటు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందుతున్నామంటున్నారు.

- రాంనగర్

భలే చౌక.. జర్నీ



తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు..

- అందుబాటులో పలు యాప్‌లు
- వినియోగించుకుంటున్న నగరవాసులు

Sunday SPECIAL

వివరాలు : 7లో..

'ఎల్ఆర్ఎస్'పై ప్రత్యేక దృష్టి



బల్దియాలో ఏర్పాటుచేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్

- దరఖాస్తుల పరిష్కారానికి బల్దియాలో హెల్ప్‌డెస్క్‌లు
- అందుబాటులో టౌన్‌ప్లానింగ్ అధికారులు
- ప్రజల్లో అవగాహనకు ఫ్లెక్సీల ఏర్పాటు
- క్షేత్రస్థాయి పరిశీలనకు 12 ప్రత్యేక బృందాలు
- 2020 ఆగస్టు 26 నాటికి దరఖాస్తు చేసుకున్న వారు అర్హులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 24 : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) అమలుపై వారం రోజుల క్రితం పభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వరంగల్ బల్దియా అధికారులు కూడా నగరంలో ప్రక్రియ నిర్వహణపై దృష్టి పెట్టారు. ఎల్ఆర్ఎస్ పరిష్కార మార్గాలను సుగమం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గతంలో దరఖాస్తు చేసుకున్న నగర ప్రజలు, భూముల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా బల్దియా కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. అలాగే గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం పరిసర ప్రాంతాలతో పాటు బల్దియా ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు వరంగల్ కలెక్టరేట్‌లో రెండు హెల్త్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ డెస్క్‌ల్లో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌తో పాటు ఒక సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తారు. 2020 ఆగస్టు 26 తేదీలోపు భూములు రిజిస్ట్రేషన్ జరిగి ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. కటాఫ్ తేదీ 26 ఆగస్టు 2020 తర్వాత చేసిన అనధికారిక లేఔట్ ప్లాట్లకు, భూములకు ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు జారీ చేసేది లేదని ఖరాకండిగా చెప్పుకొచ్చారు. ప్రభుత్వం సూచించిన నిర్ణీత తేదీ కంటే ముందు రిజిస్ట్రేషన్ చేసుకుని ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న డాక్యుమెంట్ల దరఖాస్తుల పరిశీలనకు ప్రక్రియ రెండు హెల్ప్‌డెస్క్‌లలో జరుగుతుంది. ఈ క్రమంలో అసంపూర్తిగా దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ధ్రువపత్రాలు, లింక్ డాక్యుమెంట్లతో పూర్తిస్థాయిలో అధికారులకు ఈ అవకాశం కల్పించారు. ఎల్ఆర్ఎస్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగా దరఖాస్తు వారికి వర్తించదని అధికారులు సూచిస్తున్నారు.

గ్రేటర్‌లో 12 ప్రత్యేక బృందాల ఏర్పాటు..

గ్రేటర్ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించేందుకు 66 డివిజన్ల పరిధిలో 12 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా సుమారు మినిస్ట్రీయల్ స్టాఫ్‌ను కలుపుకొని మొత్తంగా 50మంది పని చేస్తారు. ఒక బృందంలో ఇరిగేషన్ శాఖ నుంచి ఒక ఏఈ, రెవెన్యూ విభాగం నుంచి ఒక సీనియర్ అసిస్టెంట్ లేదా ఒక గిర్దావర్, టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి ఒక టీపీఎస్‌గానీ ఒక టీపీవోగాని పని చేస్తారు. వీరు రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను నేరుగా పర్యవేక్షించి అసిస్టెంట్ సిటీ ప్లానర్ లేదా కమిషనర్‌కు ఎల్ -2, ఎల్ -3 ద్వారా ప్రాసెస్ చేసి విషయాన్ని వెల్లడిస్తారు. తర్వాత అధికారులు జట్టుగా క్షేత్రస్థాయికి వెళ్లి భూమి పత్రాలు పరీక్షించి అక్కడే ఆమోదించడం లేదా రద్దు చేయడం లేదంటే షార్ట్‌ఫాల్ చేయడం చేస్తారు. ఇందుకు గాను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా గూగుల్ మ్యాప్‌తో భూమిని నిర్ధారిస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యేడాది నుంచి నూతన పద్ధతి అమల్లోకి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అయితే బల్దియా పరిధిలో 85,967 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. భూ ఆక్రమణదారులు, రియల్టర్లు ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు, కుంటలు కబ్జా చేసి నిర్మాణాలు జరిగిన వారిని గుర్తించి ఎల్ఆర్ఎస్ ద్వారా కొరఢా ఝుళిపించే అవకాశాలున్నాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

జేపీసీకి టౌన్‌ప్లానింగ్ కార్యాలయం కేటాయింపు..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ, ప్రజల సమస్యలు పరిష్కారం కోసం 2020లో అప్పటి అధికారులు బల్దియా కార్యాలయం ఆవరణలో కంట్రోల్ రూం పక్కన ప్రత్యేక గదిని కేటాయించారు. కొద్ది రోజుల తర్వాత ఎల్ఆర్ఎస్‌పై పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడంతో పనులు నిలిపేశారు. బల్దియా జేపీసీ నాయకులు చొరబడి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ కార్యాలయాన్ని అధికార పలుకుబడితో వారి పనులను అక్కడే చక్కదిద్దుకునే వారు. కాగా ఇటీవల బల్దియా జేపీసీ కాలపరిమితి ముగిసింది. జేపీసీ నాయకులు ఉద్యోగ విరమణ పొందినా కార్యాలయం తాళాలు అప్పజెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆరోపిస్తున్నారు. జేపీసీ నాయకులకు ఎవరికి ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. అయితే గతంలో తమకు కేటాయించిన కార్యాలయం తాళాలు తమకు అప్పగిస్తే పనులు నిర్వర్తిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని సిబ్బంది తెలిపారు.



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఇన్‌స్పైర్‌పై నిర్లక్ష్యం వీడాలి : డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24: ఇన్‌స్పైర్‌లో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు నామినేషన్లు దాఖలు చేయాలని, నిర్లక్ష్యం వహించిన పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల చివరి వరకు నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. తమ చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు వినూత్నమైన ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను కార్యోన్ముఖుల్ని చేయాలని కోరారు. నామినేషన్ల ప్రక్రియ ఇప్పటి వరకు ఆశాజనకంగా లేదని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ఇన్‌స్పైర్‌లో నామినేషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సమయం పాటించాలి

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని లేదంటే చర్యలు తప్పవని డీఈవో ప్రకటనలో హెచ్చరించారు. హెడ్మాస్టర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సూచించారు. కలెక్టర్ జిల్లాలోని పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారని, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు జాగ్రత్తతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో పేరుకుంటున్న అపరిశుభ్ర వాతావరణాన్ని నిర్మూలించాలని పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయని, వాటిని శుభ్రపరచాలని ఆదేశించారు.

బీఆర్ఎస్‌వి బూటకపు ధర్నాలు



- సంకెళ్లు వేసిన ఘటనను రైతులు మరిచిపోలేదు
- రుణమాఫీపై వారివి అసత్య ప్రచారాలు
- మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వివరాలు 7లో..



మురళీకృష్ణ



రాజేంద్ర ప్రసాద్

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణ
- భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్

వివరాలు 7లో..

పథకాల అమల్లో వేగం పెంచాలి

- రుణమాఫీ పూర్తి చేయకపోతే మూల్యం తప్పదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ముగిసిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బాలసముద్రం, ఆగస్టు 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ఇతర సంక్షేమ పథకాల అమల్లో వేగం పెంచాలని, అలాగే హామీలను కూడా వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మూడురోజులుగా హనుమకొండ హరితహోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశాల్లో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, అజీజ్ పాషాతో కలిసి మాట్లాడిన ఆయన ప్రభుత్వం ధరణి స్థానంలో ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై లోతుగా చర్చించి అందరి అభిప్రాయాలు తీసుకుని చట్టం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నమాట వాస్తవమే అయినా, హామీల అమల్లో ఇలానే వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు భరోసా, పంటల బీమా పథకం, కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్లస్థలాలు, పింఛన్ల పెంపు అమలుకు తక్షణం పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్న నేపథ్యంలో ఆశించిన స్థాయిలో అమలు కావడంలేదన్నారు. రేషన్ కార్డులు లేకపోవడంతో, పలు సాంకేతిక కారణాల వల్ల 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ రూ.500లకు గ్యాస్ సిలిండర్ హామీలు పేదలందరికీ వర్తించడంలేదన్నారు. సాంకేతిక కారణాల వల్ల రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, తక్షణం ప్రభుత్వం రూ.2లక్షల్లోపు రుణమాఫీ పూర్తి చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవలి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్షాల ఆరోపణలతో ఎక్కువ సమయం వృథా అయిందని, ప్రజల సమస్యలపై అంతంత మాత్రంగానే చర్చ జరిగిందన్నారు. అర్థవంతమైన చర్చలకు, శాసనసభ వేదికగా ఉండాలని అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు.

ముగిసిన సమావేశాలు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు శనివారం ముగిశాయి. 22వ తేదీన ప్రారంభమైన ఈ నిర్మాణ సమావేశాలకు రాష్ట్రసమితి సభ్యులు, ఆహ్వానితులు మొత్తం 124 మంది హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన నివేదికపై, పార్టీ నిర్మాణంపై విస్తృతంగా జరిగిన చర్చలో వివిధ జిల్లాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై సభ్యులు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణను నిర్ణయించారు. మొదటిరోజు పార్టీ పతాకాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆవిష్కరించి సమావేశాలను ప్రారంభించారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, చాడా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, వల్లా వెంకట్‌రెడ్డి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పరిణామాలు, పార్టీ నిర్మాణం, విస్తరణ, పటిష్ఠం చేయడం తదితర అంశాలపై తమ సందేశాలిచ్చారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, అధ్యక్షతన జరిగిన సమావేశాలలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కలవేణ శంకర్, వి.ఎస్.బోస్, బాలమల్లేష్, నరసింహ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 24: ప్రత్యేక ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దివ్యాంగులు, వయోవృద్ధులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మొత్తం 17 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి హైమావతి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఎంహెచ్‌వో కె.వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీతో యువకుడి హల్‌చల్

ఉద్యోగ భద్రతా కల్పించాలని ఓ యువకుడు కలెక్టరేట్‌లో హల్‌చల్ సృష్టించాడు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దివ్యాంగుల ప్రజావాణి నిర్వహిస్తుండగా అధికారులందరూ ఆ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. అదేసమయంలో రాయపర్తి మండలం మైలారానికి చెందిన యువకుడు గాడిపల్లి సుధీర్‌రాజు మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డిలు అన్యాయం చేశారనే ఫ్లెక్సీతో కలెక్టరేట్ బిల్డింగ్ ఎక్కేందుకు యత్నించాడు. గమనించిన సిబ్బంది యువకుడిని అడ్డుకుని, కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో వాచ్‌మెన్‌గా రూ.12వేల వేతనంతో 15 ఏళ్ల నుంచి పని చేస్తున్నట్టు తెలిపాడు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న వారిని తీసేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అన్యాయమని వాపోయాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీఇవ్వడంతో శాంతించాడు.



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

కలెక్టర్‌ను కలిసిన డీఏవో

వరంగల్‌సిటీ: ఇటీవల బదిలీపై వచ్చిన వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అనురాధ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డీఏవో అనురాధ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డ్రగ్స్‌తో అనర్థాలపై అవగాహన కల్పించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 24 : విద్యార్థుల ప్రవర్తనపై కళశాలల యాజమాన్యాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో నగరంలోని ఇంటర్, డిగ్రీ కళశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కళాశాలల యాజమన్యాలను నమ్మి పిల్లలను తల్లిదండ్రులు పంపిస్తున్నారని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వలన జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాస్టల్స్, క్యాంటీన్‌లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. కళాశాల పరిసరాల్లో గంజాయి సేవించినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవిందర్, ఏసీపీలు జితెందర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

హాకీకి పునర్వైభవం వచ్చేనా?

నేడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 : విశ్వ క్రీడ వేదిక పై భారత దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా ప్రపంచానికి కనిపించే విధంగా ఒలంపిక్స్ పురుషుల హాకీ జట్టుకు ప్రాతినిథ్యం వహించి ఏకాంగా హ్యాట్రిక్ పసిడి పతకాలను అందించిన హాకీ దిగ్గజం మాణికట్టు మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్. తన క్రీడా ప్రతిభతో మైదానంలో రాకెట్‌లా దూసుకుపోతూ ప్రత్యర్థులను చిత్తు చేస్తూ గోల్స్ చేసేవాడు. దేశవాలి క్రీడగా ప్రాచుర్యం పొందిన హాకీ క్రీడలో 1936సంవత్సరం మాస్కో విశ్వ క్రీడల్లో ధ్యాన్‌చంద్ సారథ్యంలో మన జట్టు చివరి పసిడి అందుకున్నాక భారత హాకీ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. అంతర్జాతీయ స్థాయి పోటీలో ధ్యాన్ చంద్ స్ఫూర్తితో భారత్‌కు మరో ఐదు స్వర్ణాలు, ఒక రజతం రెండు కాంస్య పతకాలతో సరిపెట్టుకొని అ తరువాత ఏలాంటి పతకాలు సాధించకుండా నాలుగు దశాబ్ధాలుగా వేచి చూడాల్సి వచ్చింది. 2021లో టోక్యోలో నిర్వహించిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో భారత దేశ జట్టు తరుపున మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలో 4దశబ్ధాల నిరీక్షణకు తెరతీస్తు చారిత్రాత్మక విజయాన్ని దేశానికి అందించి కాంస్య పతకంతో హాకీ ప్రేమికుల్లో నూతనోత్సాహం నింపాడు. అదే విధంగా ఆగస్టు 2024 పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్ హాకీ క్రీడలో తృతీయ స్థానంలో నిలిచి వరుసగా రెండో సారీ కాంస్య పతకం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకవచ్చారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ మరణం తరువాత ఒలంపిక్స్‌లో దేశానికి రెండు కాంస్య పతకాలు అందించిన స్ఫూర్తిని నేటీ క్రీడాకారులు తీసుకొని రాణించాల్సిన అవసరం ఉంది. 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన సాధించిన ఘనతకు గుర్తుగా భారత ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతి ఏట నిర్వహించడం ఆనవాయితిగా వస్తుంది.

ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్థమాన క్రీడాకారులకు శిక్షణ అందించే అసోసియేషన్లు పూర్తి స్థాయిలో పర్యావేక్షణ లోపం కారణంగా ఈ క్రీడ పట్ల ఆసక్తి చూపడం లేదని పలువురు సీనియర్ క్రీడాకారులు వాపోతున్నారు. కోచ్‌లు సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ క్రీడ అంతరించి పోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జేఎన్ఎస్ఎస్‌లో పలు క్రీడలకు వేదికలు, కోర్టులు ఉన్నప్పటికీ దేశవాళి క్రీడగా ప్రసిద్ధి గాంచిన హాకీ క్రీడకు మైదానం లేకపోవడంతో ఈ క్రీడ పట్ల జిల్లా క్రీడా సమాఖ్య ఎంత నిర్లక్ష్యం చేస్తుందో ఇట్టే అర్థమవుతోంది.

సండే స్పెషల్ SUNDAY SPECIAL



భలే చౌక.. జర్నీ

▸▸ తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు ▸▸ అందుబాటులో పలు యాప్‌లు

▸▸ వినియోగించుకుంటున్న నగరవాసులు

రాంనగర్, ఆగస్టు 24: త్రినగరిలో చాలా చౌకగా.. తక్కువ చార్జీకే గమ్యస్థానాలకు చేర్చేందుకు పలు యాప్‌ల ద్వారా వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అవకాశాన్ని వరంగల్, హనుమకొండ, కాజీపేట (త్రి నగరి) ప్రజలు వినియోగించుకుంటున్నారు. పలు యాప్‌లు కార్పొరేషన్ పరిధిలో తమ సేవలను అందిస్తుండగా ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే చాలు నిలుచున్న స్థానం నుంచి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునే సౌకర్యం కలుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో ఈ యాప్‌లు ఎంతగానో సౌకర్యవంతంగా ఉన్నాయని నగరవాసులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు యాప్‌లు నగర పరిధి లోనే అందుబాటులో ఉండగా వినియోగదారుల అభిప్రాయం మేరకు మున్ముందు హైదరాబాద్ వరకు సర్వీసు అందించే అవకాశం ఉన్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

అందుబాటులో యాప్‌లు..
చౌకగా ప్రయాణం..

ప్రస్తుతం నగరంలో ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మూడు యాప్‌లు బైక్, ఆటో, కార్ సౌకర్యం కల్పిస్తున్నాయి. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి బుక్ చేసుకుంటే క్షణాల్లో ఇంటికి వాహనం వస్తుంది. యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే వాహనాలు, ఇతర రెంటెడ్ వాహనాలకు చార్జీల్లో చాలా తేడా ఉంటోంది. చౌకగా కోరుకున్న స్థానానికి చేరుకోవచ్చు. ఏ టైమ్‌లోనైనా యాప్‌ల ద్వారా ప్రయాణం సురక్షితమని, ఒకరి కంటే ఎక్కువ ఉన్నవారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటే బయటికంటే సగం చార్జీలకంటే మించకుండా ప్రయాణం చేసే వీలుందని వినియోగదారులు చెబుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగాలు చేసేవారు, విద్యార్థులు బైక్‌లను బుక్ చేసుకుని వెళుతున్నారు. ఈ క్రమంలో బైక్ సర్వీసుకు గిరాకీ బాగానే ఉన్నట్టు తెలిసింది. వరంగల్ కోట, వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయం, కాజీపేట, వరంగల్ రైల్వే జంక్షన్‌లు, బస్టాండ్లకు ఆటో, బైక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఒకరికంటే ఎక్కువ మంది ప్రయాణం చేయాల నుకునేవారు ఆటో లేదంటే కారు సర్వీసును వినియోగిస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారు సైతం ఈ యాప్‌లపై ఆధారపడుతుండటం విశేషం. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్ననేపథ్యంలో సొంతవాహనాలున్న వారు కూడా ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్‌ల వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది.

కొన్ని ప్రాంతాలకు వసూలు చేస్తున్న చార్జీలిలా (సుమారుగా)

▸▸ **ఓలా సర్వీసు:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు 7.5 కి.మీ దూరానికి బైక్ రూ.58, ఆటో (ముగ్గురు) రూ.114, కార్ (నలుగురు) రూ.230 చార్జీ ఉంటుంది. అదే కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు 8కి.మీ దూరానికి బైక్ రూ.80, ఆటో రూ.140, కారు రూ.300చార్జి వసూలు చేస్తున్నారు.

▸▸ **ఊబర్** : కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్‌కు ఆటో రూ.114, కారు రూ.215 చార్జీ ఉంటుంది. కేయూ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఆటో రూ.160, కారు రూ.318 చార్జీ.

▸▸ **ర్యాపిడో:** కేయూ జంక్షన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్‌కు బైక్ రూ.77, ఆటో రూ.120, కారురూ.207 చార్జీ తీసుకుంటున్నారు. ఇక కేయూ జంక్షన్ నుంచి వ రంగల్ రైల్వేస్టేషన్ వరకు బైక్ అయితే రూ.100, ఆటో కు రూ.160, కారు రూ.270 చార్జీ.

తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు

- గడ్డం కుమారస్వామి, వ్యాపారి



ఈ యాప్‌లు సద్వినియోగం చేసుకోవడం ద్వారా తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరుకోవచ్చు. సొంత వాహనాలు ఉన్నా నగరంలోని ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ యాప్‌లను వినియోగించుకుంటున్నా. మేం ఉంటున్న విద్యారణ్యపురి నుంచి భద్రకాళి, వేయిస్తంభాల ఆలయంతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు కుటుంబసభ్యులతో వెళ్లాలనుకుంటే కారు లేదా ఆటో బుక్ చేసుకుంటాం. ముగ్గురం రూ.120చార్జీ మించకుండా ఆలయానికి వెళతాం. వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలనుకున్నా రూ.200 మించదు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలనుకుంటే రూ.300కంటే ఎక్కువవుతుంది. ఈ యాప్‌లు అందుబాటులోకి రావడంతో డబ్బులు ఆదా, ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి తదితరులు

వేడుకగా 'ఎస్ఆర్' డైరెక్టర్ కూతురి వివాహ రిసెప్షన్

మడికొండ, ఆగస్టు 24: ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి ప్రథమ కుమార్తె సంజన-గౌతమ్‌ల రిసెప్షన్ వేడుక మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ, వ్యాపార వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ స్వర్ణకుమారి

▸▸ కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మురళీకృష్ణ

▸▸ భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేంద్రప్రసాద్

వరంగల్ మెడికల్, ఆగస్టు 24 : ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.స్వర్ణకు మారి నియమితులయ్యారు. కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వి. మురళీకృష్ణను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జీవో ఆర్టీ నెంబర్ 417ను విడుదల చేశారు. డాక్టర్ జి.స్వర్ణకుమారి 2005 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో డెర్మటాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.

అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది తిరిగి ఎంజీఎంలోనే ప్రస్తు తం పని చేస్తున్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. కాగా, డాక్టర్ జి.స్వర్ణకుమారి ఈ విధుల్లో చేరేందుకు కుటుంబ సమస్యల కారణంగా నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ వి.మురళీకృష్ణ ఇటీవలే ఎంజీఎం ఆస్పత్రికి పిల్లల విభాగం ప్రొఫెసర్‌గా విభాగం అధిపతిగా బదిలీపై వచ్చారు. నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన అనుభవం కూడా ఉంది.

భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి. రాజేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం భూపాలపల్లి మెడికల్ కళాశాలలో రాజేంద్రప్రసాద్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

అలాగే హనుమకొండలోని ప్రభుత్వ టీబీ, చాతి వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సి.సంజీవ్ కుమారి నియమితులయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి రేడియో థెరపి ప్రొఫెసర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు.

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజేశ్వరి, వరంగల్ సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజాభరత్ కుమార్‌లను ప్రభుత్వం నియమించింది.

డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి

▸▸ నాలుగు రోజుల్లో డెంగీతో ఇద్దరు మృతి

▸▸ భయాందోళనలో తొర్రూరు పట్టణప్రజలు



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 24 : డెంగీ జ్వరంతో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యుల కథనం ప్రకారం. నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన బేతమల్ల రమేష్-లక్ష్మీకాంత దంపతులు గత 20 ఏళ్లుగా తొర్రూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు ప్రేమ్‌కుమార్, కుమార్తె ప్రియాంక సంతానం. రమేష్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు బేతమల్ల ప్రేమ్‌కుమార్ (23) బీటెక్ ఫైనల్ ఇయర్ వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతూ, ఇటీవల కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 19వ తేదీన రాఖీ పండుగకు తన చెల్లెలుతో రాఖీ కట్టించుకునేందుకు తొర్రూరుకు రాగా, జ్వరం వచ్చింది. 22వ తేదీన తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని అడ్మిట్ కావాలనడంతో.. 23న పట్టణంలోని మరో ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. ప్రేమ్‌కుమార్‌కు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, పరిస్థితి విషమంగా ఉందని.. పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని సూచించడంతో ఖమ్మంలోని సురక్ష దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందాడు. కాగా, మృతుడి సోదరి ప్రియాంక బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. కొద్ది రోజుల్లో కుమారుడు చేదోడు వాదోడుగా నిలుస్తాడని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు తీవ్ర నిరాశ ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణ లోపం

నాలుగు రోజుల వ్యవధిలో డెంగీ జ్వరంతో ఇద్దరు మృతి చెందడంతో తొర్రూరు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 20వ తేదీన పట్టణ కేంద్రానికి చెందిన హత్విక (4) డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే! పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో మునిసిపాలిటీ సిబ్బంది చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో పారిశుధ్య లోపం ఏర్పడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

బీఆర్ఎస్‌వి బూటకపు ధర్నాలు

▸▸ రుణమాఫీపై వారివి అసత్య ప్రచారాలు

▸▸ మీడియాతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 24 : రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులవి బూటకపు ధర్నాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శనివారం హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. దేశంలోనే రుణమాఫీ చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని మండిపడ్డారు.

ఖమ్మంలో సంకెళ్లు వేసిన ఘటనను రైతులు మరువలేదు

రుణమాఫీని వక్రీకరిస్తూ రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు ఆరాటపడుతున్నారని రవీందర్‌రావు దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయంలో ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘటన ఇంకా రైతులు మరచిపోలేదన్నారు. రైతలు బీఆర్ఎస్‌ను అధికారం నుంచి దించివేసినా ఇంకా ఆ పార్టీ నేతలు కళ్లు తెరవలేదన్నారు. రైతుల పొట్ట కొట్టిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సహకార సంఘాల ద్వారా దశల వారిగా రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం 27 రోజుల్లోనే 22 లక్షల మంది రైతులకు మొత్తంగా రూ. 18 కోట్ల రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ చేయడం జరిగిందని వివరించారు.

అర్హులందరికీ రుణమాఫీ తప్పక వర్తింపు

బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని రవీందర్‌రావు కోరారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పక జరుగుతుందని చెప్పారు. సాంకేతిక సమస్యలు కొన్ని ఇతర కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ జరగడంలో జాప్యం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం వెను వెంటనే సమస్య పరిష్కార చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు ఎవరైతే అర్హులైన రైతులు సమస్యలు ఎదుర్కొన్నారు పరిష్కార చర్యలతో రుణమాఫీ లబ్ధి పొందుతున్నారని వివరించారు. అధికారంలో ఉండగా ఏనాడు రైతుల కష్టాలు పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా రాజకీయ స్వార్థాన్ని మరిచి రైతులకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తే మంచిదన్నారు. లేని పక్షంలో రైతుల నుంచి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. బీఆర్ఎస్ దగాకోరు మాటలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు.

భద్రకాళి, ఐనవోలు ఆలయాల ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 24: భద్రకాళి, ఐనవోలు ఆలయాలకు ట్రస్టు బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని 26ఆలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం చేపట్టాలని ప్రభుత్వం గత రాత్రి నోటి ఫి కేషన్ జారీ చేసింది. 26దేవాలయాల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెండు దేవాలయాలు ఉన్నాయి. ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దేవాలయం ట్రస్టు బోర్డు, శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నోటిఫికేష న్ జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భద్రకాళి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేశారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయలేదు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం బోర్డుల ఏర్పాటు చేయాలని నోటిఫికేషన్ జారీ చేసింది. భద్రకా ళి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటులో 14 మందితో కూడిన ట్రస్టు బోర్డు ఉంటుంది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈవో ఉంటారు. ఇందులో వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్న వారు చైర్మన్, ఒక మహిళ, 12మంది ధర్మకర్తల మండలి సభ్యులుగా ఉంటారు.

ఓటింగ్ శాతం పెంచాలి: కలెక్టర్



ఓటరు అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 24: ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని, గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంతో స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన చైతన్య కార్యక్రమాల ఎంతో దోహదం చేశాయని కలెక్టర్ సత్యశారద అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఓటరు చైతన్య కార్యక్రమాల నివేదికను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమాలైనా పౌర సమాజ చైతన్యంతో, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయన్నారు. మహాత్మాగాంధీ చారిటబుల్ ట్రస్ట్ వరంగల్, హనుమకొండ జిల్లాల కన్వీనర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు మాట్లాడుతూ గాంధీ- గుడి ఆధ్వర్యంలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఓటరు అవగాహన చైతన్యరథం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరలోని వివిధ కాలనీల్లో తిరుగుతూ ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్యపరుస్తూ కరపత్రాలు అందజేసి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎల్‌డీఎం రాజు, మండల పరశురాములు పాల్గొన్నారు.

'డీపీఆర్వోపై చర్యలు తీసుకోవాలి'

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అందరి ముందు మహిళపై పరుష పదజాలంలో మాట్లాడిన డీపీఆర్వో అయూబ్ అలీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని శనివారం కలెక్టర్ సత్యశారదను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఏపీఆర్ఓ ప్రేమలతను చేయని తప్పుకు డీపీఆర్వో తిట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు తరాల సందీప్, పి.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, బండి అశోక, చుంచు రాజేందర్, సాదు కుమారస్వామి, పప్పు రమేశ్, కన్నాల వెంకట్, బట్టి విక్రమ్ పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా కమిటీల ఏర్పాటు: బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్‌లూథర్

ఖిలావరంగల్, ఆగస్టు 24: జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కమిటీలను భారతీయ జనతాపార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌ల ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొలెపాక మార్టిన్ లూథర్ ప్రకటించారు. శనివారం 18వ, డివిజన్ లేబర్‌కాలనీలో జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి బన్నా ప్రభాకర్ అధ్యక్షతన కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులు నలిగంటి నర్సింగం, పొలెపాక జనార్దన్, జిలుకర వీరస్వామి, దామెర సదానందం, మైదం వీరస్వామి, చింతల నవీన్, తుల అనూష, జన్ను రవి, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా మాదాసు రాజు, ఉసిల్ల దయాకర్, తనుగుల అంబేద్కర్, ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శిగా నమిండ్ల కన్నయ్య, జిల్లా కార్యదర్శులుగా నూరం రాజు, సిలువేరు భాస్కర్, మంతెన అనిత, కంజర్ల విజయ్, ఎను మగంటి రాజశేఖర్, సింగారపు నీలాకర్, మరుముల్ల ప్రవీణ్, సోషల్ మిడియా ఇన్‌చార్జి మేకల రాజు, నగర కార్యవర్గ సభ్యులు మైదం సుదర్శన్ అఫిషియల్‌ఎస్సీ మోర్చా స్పోక్‌పర్సన్ గొర్రె కోటిలను ప్రకటించారు.

ఆటో దొంగ అరెస్టు



ఆటో దొంగను అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 24: ప్రయాణికుడిలా ఆటో ఎక్కి, ఆటో డ్రైవర్‌ను కొట్టి ఆటోను దొంగలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం. నగరంలోని శాకరాసికుంటకు చెందిన పులిచేరి చంద్రశేఖర్ (38)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యాపిల్లలతోపాటు చంద్రశేఖర్ కూలి పనుల లు చేస్తూ జీవిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడి కొద్దికాలంగా ఏపనీ చేయడం లేదు. జల్సాలకు డబ్బులు లేకపోవడంతో ఈనెల 21న వరంగల్ బస్టాండ్ వద్ద శివనగర్‌కు వెళ్లాలని ఆటో ఎక్కాడు. అనంతరం తన చేతికున్న కడియంతో ఆటో డ్రైవర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్, రూ.800 నగదుతోపాటు ఆటోను అపహరించాడు. నగదును మద్యానికి ఇంట్లోకి వాడుకొని సెల్‌ఫోన్ పిన్నవారి స్ట్రీట్‌లో అమ్ముదామని దొంగలించిన ఆటోలో వస్తుండగా హెడ్ పోస్టాఫీస్ వద్ద వాహన తనిఖీలో భాగంగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్సై వెంకన్న క్రైంపార్టీ ఉపేందర్, రంజితులు అతన్ని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న, క్రైం పార్టీ సిబ్బందిని సీఐ అభినందించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

మట్టెవాడ, ఆగస్టు 24: వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పలువురు బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ మద్దూరు జిల్లా కన్వీనర్ ధర్మపురి రామారావుతోపాటు సీనియర్ నాయకులు బేతి రంజిత్, నేతాని రాంప్రసాద్, ఎస్.నాగరాజు, రుద్రోజు నవీన్, ఆర్.వేణు పలువురు గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచే పార్టీ అని కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించిందన్నారు. తూర్పులో బీసీ నియోజకవర్గంలో దొర పెత్తనం ఎక్కువైందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూచన రమేశ్, జూపాక అనిల్, ప్రమీల, రవీందర్, సుభాన్, లీలావతి, సరిత, గనన్, ఆసిఫ్, తాసిన్, శ్రీకాంత్, అరవింద్, రవీందర్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ఖతమైంది...

దేవాదుల దూరమైంది

రైతులకు నీరు లేక విలవిలలాడుతున్నారు..

సీఎం రేవంత్‌రెడ్డివి బోగస్ మాటలు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజం



కాపుల కనపర్తిలో ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, రైతులు

సంగెం, ఆగస్టు 24 : కాళేశ్వరం ప్రాజెక్టు రావాల్సిన నీరు రావడం లేదని, గ్రామల్లో చెరువుల్లోకి దేవాదుల నుంచి రావాల్సిన నీరు అందడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పుణ్యాన కాళేశ్వరం ఖతమైందని, దేవాదుల రైతులకు దూరమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. శనివారం కాపులకనపర్తిలో సొసైటీ ఎదుట ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలు మాట్లాడుతూ కాపులకనపర్తి సొసైటీలో వంద శాతం రుణాలు మాఫీ కాలేదన్నారు. బ్యాంకర్లు ఆరునెలల కిందనే రిపోర్టులు పంపించినా కావాలని బ్యాంకర్లపై ప్రభుత్వం అబద్దాలు చెపుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హరీష్‌రావు చేసిన సవాల్‌కు భయపడి ఆగమేఘాల మీద అసంపూర్తిగా రుణమాఫీ చేశారని ఆరోపించారు. ఆగస్టు 15తేదీ వరకు చేయకపోతే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని అనడంతో సర్కారుకు భయం పుట్టిందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని గుళ్లమీద ప్రమాణాలు చేసి పార్లమెంటు ఎన్నికలు వాడుకున్నారని ఆరోపించారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకున్న ముఖ్యమంత్రి మాట తప్పినందుకు రాజీనామా చేయకుండా, రైతులకు క్షమాపణ చెప్పి, దేవుళ్ల దగ్గరకు వెళ్లి తప్పు చేశానని ఒప్పుకోవాలన్నారు. ఎన్నికల ముందు రూ.46 వేల కోట్లని, క్యాబినెట్‌లో రూ.26వేల కోట్లని, మాఫీ చేసింది రూ.17వేల కోట్లని తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆరోపించారు. ఈనెల 30 తేదీ వరకు రుణమాఫీ చేయకపోతే పోరాటాన్ని ఉధృతి చేస్తామన్నారు. ఎరువులు, నీరు, కరెంటు కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. సీఎంరేవంత్ రెడ్డి బోగస్ మాటలు బంద్ చేసి రైతులను ఆదుకోవాలని, సీఎం హుందా తనాన్ని దెబ్బ తీసేలా విధంగా మాట్లాడుతున్నారని, ఇష్టమొచ్చినట్లు కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, హరీష్‌రావులను తిట్టడం హేయమైన చర్యన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, మాజీ సీఎం కేసీఆర్‌పై కేసులు వేసేందుకు మాత్రం తీరిక ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ బూర సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పి.సారంగపాణి, మాజీ ఎంపీపీలు సదానందం, వీరాచారిలు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా ఆర్ఓఆర్ ముసాయిదా చట్టం : రేవూరి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్ శారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 24: ప్రజలు, రైతులకు ఉపయోగంగా ఉండేలా ఆర్ఓఆర్ ముసాయిదా చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో రాష్ట్రాలు భూ చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి తీసుకొస్తున్న కొత్త ఆర్ఓఆర్ చట్టం భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారం కోంస నూతన ఆర్ఓఆర్ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వాహణ పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో విస్తృతంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తగు సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు. నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలను రెండు మూడు రోజుల్లో కలెక్టర్ కార్యాలయంలో అందిస్తే వాటిని ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి తుది చట్ట రూపకల్పన కోసం ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అదనపు జాయింట్ కలెక్టర్ విఠల్, విశ్రాంత రెవెన్యూ అధికారి సురేశ్ కోఠార్, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీనియర్ సైంటిస్ట్ మల్లేశం, ప్రభుత్వ ప్లీడర్ నర్సింహారావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవన్‌గౌడ్, సెక్రటరీ మదస్సిర్ అహ్మద్, విద్యాసాగర్, తహసీల్దార్లు, న్యాయవాదులు, రైతులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

మేయర్ గుండు సుధారాణి



వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్‌ను సందర్శించిన మేయర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 24 : వరంగల్ నగరంలోని ఫిల్టర్ బెడ్‌లలో పూర్తిస్థాయిలో నీటి శుద్ధీకరణ చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌తో పాటు అమ్మవారిపేట, భట్టుపల్లి ప్రధాన పైప్‌లైన్ వాల్వ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ఫిల్టర్ బెడ్‌ల నుంచి ప్రజలకు నీరు అందిస్తుండగా నీరు వృథాగా పోకుండా ముందస్తుగా పైప్‌లైన్ లీకేజీలను గుర్తించాలని సూచించారు. ఫిల్టర్‌బెడ్‌లలో నీరు సరిగా ఫిల్టర్ అవుతున్నాయా.. లేదా అని అక్కడి సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని , నీటి సాంద్రత సరిగా ఉన్నప్పుడే ప్రజలకు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, డీఈలు సారంగం, రాజ్‌కుమార్, ఏఈ సంతోష్‌బాబుతో పాటు కార్పొరేటర్ సునిల్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై 'కొండా'కు ఫిర్యాదు



మురళీధర్‌రావుతో మాట్లాడుతున్న కాలనీ వాసులు

వరంగల్ సిటీ, ఆగస్టు 24: కార్పొరేటర్ అనిల్ కాలనీలో యువకులతో కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ 27వ డివిజన్ కొండా పటేల్‌కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు ఫిర్యాదు చేశారు. శనివారం కాలనీ అధ్యక్షుడు దౌడు నాగరాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్, చిలుక రాజుపై ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండాను కలిసి ఫిర్యాదు చేశారు. విద్యుత్ మీటర్ల కోసం మీసాల ప్రకాష్ పదివేలు వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని వెల్లడించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు రామగిరి శ్రీవిద్య, కొండపర్తి శ్రీలత, పొడిశెట్టి సరళాదేవి, ఓరుగంటి రేణుక, రబ్బానీ, రాణి, విజయలక్ష్మి, రవి, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

స్కూల్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి : కొండా

గిర్మాజిపేట : కృష్ణకాలనీ ప్రభుత్వ పాఠశాల వర్షం నీరుతో ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని బల్దియా, జిల్లా విద్యాశాఖాధికారులను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు కోరారు. శనివారం పాఠశాల, జూనియర్ కళాశాలలను సందర్శించి, గ్రౌండ్‌ఫ్లోర్ వర్షం, డ్రైనేజీతో నిండడంతో అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల, కళాశాల నుంచి హంటర్ రోడ్డు వైపు ఉన్న డ్రైనేజీ కాలువ పూర్తిగా పాడైపోవడం, బయటి నీరు పాఠశాల లోపలికి రావడం, వర్షం నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏటా ఇదే సమస్య తలెత్తుతోందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అశోక్ కుమార్ ఆయనకు వివరించారు. అలాగే పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, మొదటి అంతస్తులోని పాఠశాల తరగతి గదుల స్లాబ్ పెచ్చులుడుతున్నాయని వివరించారు. వర్షపునీరు బయటికు వెళ్లేలా, బల్దియా డీఈ శ్రీనివాసరావు, అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు శ్రద్ధపెట్టాలని వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి శంకర్‌కు కొండా సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, టీపీపీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల కోసం వైద్యశిబిరం



వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

వరంగల్ సిటీ, ఆగస్టు 24: ఆయుర్వేద మందులు నిదానంగా, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా పనిచేస్తాయని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. శనివారం కాశిబుగ్గ తిలక్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో జాతీయ ఆయూష్ మిషన్, సీనియర్ సిటీజన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి కార్పొరేటర్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యం పురాణకాలం నుంచి బహుళప్రచారంలో ఉన్నదని, దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తాయన్నారు. సుమారు రెండు వందల మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటిండెంట్ పద్మావతి, జాతీయ ఆయుష్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్, ఫార్మసిస్టులు ఓదెలు, దయాకర్, సీనియర్ సిటీజన్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం, ఉపాధ్యక్షుడు కందుల గోవర్ధన్, సెక్రటరి గుర్రపు నర్సింహులు, సలహాదారులు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి యాదగిరి

మార్కెట్ నుంచి బాలాజీనగర్ జంక్షన్ వరకు ర్యాలీ



ఏనుమాముల మార్కెట్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

వరంగల్‌సిటీ, ఆగస్టు 24: ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూడాపై హత్యాచారం నిరసిస్తూ శనివారం పార్టీ ఆధ్వర్యంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ నుంచి బాలాజీనగర్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యాదగిరి మాట్లాడుతూ.. అతి దారుణంగా మహిళా డాక్టర్ పనిచేస్తున్న హస్పిటల్‌లోనే పక్కా ప్లాన్‌తో కొందరు దుండగులు రేప్ చేసి హత్య చేయడం హేయమైన చర్యన్నారు. పాశవికంగా వ్యవహరించిన వారిని వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రావిరాకుల ప్రసంగి,సిలువేరు సుస్మిత, జన్ను ప్రవీణ్, జన్ను చిట్టి, కంది రవి, ఎస్‌కె. పాషా, శ్రీనివాస్, నాగరాజు, మొగిలి, రాజలింగం పాల్గొన్నారు.

శివనగర్‌లో పోలీసుల కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య

కరీమాబాద్, ఆగస్టు 24: శివనగర్, ఏసిరెడ్డి నగర్ ప్రాంతాల్లో మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, పోలీసు బృందాలు శనివారం రాత్రి కార్డెన్ సేర్చ్ నిర్వహించాయి. సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో 30వేల విలువైన అక్రమ మద్యంతోపాటు, సరైన పత్రాలు లేని 24 ద్విచక్రవాహనాలు, రూ. 5వేల విలువైన నిషేధిత గుట్కాలు సీజ్ చేశారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని, గుట్కా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నలుగురు నలుగురు ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న జబర్దస్త్ కమెడియన్



అమ్మవారి ప్రసాదం అందుకుంటున్న రాకేష్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 24: భద్రకాళి అమ్మవారిని 'జబర్దస్త్' కమెడియన్ రాకింగ్ రాకేష్ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న రాకేష్ వల్లభ గణపతిని దర్శించుకొని భద్రకాళి అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాకేష్‌కు ఆశీర్వచనం అమ్మవారి తీర్థ ప్రసాదం శేష వస్త్రాలు అందజేశారు.

28నుంచి ఎల్లూరురంగంపేటకు బస్సు సర్వీసులు

సంగెం, ఆగస్టు 24: మండలంలోని ఎల్లూరు రంగంపేట గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. ఈనెల 28 నుంచి నడపాలని అధికారుల సమీక్ష సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. దీంతో బుధవారం నుంచి వరంగల్ నుంచి గ్రామం వరకు నాలుగు ట్రిప్పులను నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

కల్యాణమస్తును సద్వినియోగం చేసుకోవాలి

మట్టెవాడ, ఆగస్టు 24: వరంగల్ పట్టణంలోని పేద ఆర్యవైశ్యులు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మేయర్, వరంగల్ ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు సూచించారు. శనివారం వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్‌లోని వైశ్య భవన్‌లో కల్యాణమస్తు పథకం కింద నిరుపేద వధువుకు పుస్తెలు, మట్టెలు, రూ.2,516 నగదును అందజేశారు. కార్యక్రమంలో అజయ్, శ్రీలత, లావణ్య, రమాదేవి, మంజుల, ప్రియాంక, మౌనిక, పూజ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లు

శంభునిపేట, ఆగస్టు 24 : అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయిస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అన్నారు. దూపకుంటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్‌లను శనివారం కొండా పరిశీలించారు. నిర్మాణ పనులపై ఆరా తీశారు. దూపకుంటలో 2,200 డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మిస్తున్నారని, 80శాతం పనులు పూర్తయినట్టు కొండా తెలిపారు. అర్హులను గుర్తించి త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్‌లు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఖిలా వరంగల్ పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, భైరబోయిన ఉమదామోదర్ యాదవ్, బోగి సువర్ణసురేష్, బాల్నె సురేష్, ఉర్సాన్, చింతాకుల అనిల్, పల్లం పద్మ రవి, నాయకులు గోపాల నవీన్‌రాజ్, కేడల పద్మ, ఎమ్డీ ఆయూబ్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 25 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

యువతపైనే దేశ భవిష్యత్

దుగ్గొండి, ఆగస్టు 24: యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఒలిగె నర్సింగరావు, నర్సంపేట బ్లాక్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాగం శివాజీలు అన్నారు. మండలంలోని శివాజీనగర్, బందంపల్లి గ్రామాలలో ఎన్నికలకు సంబంధించిన ఐవైసీ ఆప్ మెంబర్‌షిప్‌పై శనివారం యూత్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునే యాప్ అందుబాటులో ఉందన్నారు. ఓటు వినియోగించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు కొత్తకొండ రవివర్మ, గాదం రమేశ్, బుస్సారి రామారావు, సుకినె నాగరాజు, బండారి ప్రకాశ్, విరాట్, విక్రమ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

● విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు ● భయాందోళనలో ప్రజలు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు







నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి వార్డులో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు, ఓపీ విభాగం వద్ద వేచి ఉన్న దృశ్యం

నర్సంపేట, ఆగస్టు 24 : నర్సంపేట నియోజకవర్గం జ్వరాలతో వణికిపోతోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రతీ ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు జ్వర బాధితులే ఉండడం గమనార్హం. ముందుగా కీళ్ల నొప్పులతో ప్రారంభమై తర్వాత కాళ్ల నొప్పులు జ్వరంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో మార్పులు, అడపదడపా వర్షాలతో నర్సంపేటలో రోగాలు విజృంభిస్తున్నాయి. ప్రజారోగ్యంపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. విషజ్వరాలు, మలేరి యా, డెంగీ, చికున్‌గున్యా విజృంభిస్తున్నాయి. కలుషిత నీరు, ఆహారం, పారిశుధ్యం లోపించి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో రోగులు బారులు తీరారు. పీహెచ్‌సీల్లో కూడా జ్వరం బారిన పడినవారు చికిత్సల కోసం వస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి 200 నుంచి 300 మంది ఔట్‌పేషంట్లు వైద్యపరీక్షల కోసం వచ్చివెళుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వార్డుల్లోని పడకలు సరిపోక వరండాలో పడకలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యచికిత్సలు అందిస్తున్నారు. నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లోని అనేక గ్రామాలకు చెందిన ప్రజలు సీజనల్ వ్యాధుల బారి పడి ఇబ్బందులకు గురవుతున్నారు.

పరిశుభ్రతను పట్టించుకోని వైనం

విషజ్వరాలు, డెంగీ, మలేరియా వంటి జ్వరాల నివారణకు పరిసరాల పరిశుభ్రతే ప్రధాన కారణంగా చెప్పొచ్చు. గ్రామాలలో, పట్టణంలో పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలం చెందుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాలలో సమస్యలను పట్టించుకునే వారు లేక, నిధుల లేమితో పారిశుధ్యం పడకేసి జనం సీజనల్ వ్యాధుల బారిపడి నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చెత్త చెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీలు అధ్వాన్నంగా మారడంతో నీరునిలిచి దోమలు బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. మునిసిపల్ కమిషనర్ బదిలీపై వెళ్లడం, మునిసిపల్ కౌన్సిలర్లు ప్రజల సమస్యలను గాలికి వదిలి వేయడంతో మునిసిపాలన గాడితప్పినట్లయింది. వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్‌కు నర్సంపేట మునిసిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఆయన బాధ్యతలు చేపట్టాక పారిశుధ్య నిర్మూలనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి జనం జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ.59వేల సొత్తు స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఖానాపురం, ఆగస్టు 24: మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నెక్కొండ ఇన్‌చార్జి సీఐ చంద్రమోహన్ ఎస్సై రఘుపతితో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న మండల కేంద్రంలోని కొత్తపెల్లి లత ఇంట్లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.59వేల విలువైన తులం బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి పట్టగొలుసులు, రూ.10వేల నగదు దొంగిలించారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై రఘుపతి విచారణ చేపట్టారు. వేలి ముద్రల ఆధారంగా పాత నేరస్తుడు చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన సాదు రాజుగా గుర్తించారు. రాజు వంట మాస్టర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తూ చెన్నారావుపేటకు వచ్చి వెళ్తుండేవాడు. రాజుపై నిఘాపెట్టిన పోలీసులు శనివారం మండల కేంద్రంలోని హనుమాన్ సెంటర్‌లో చోరీ చేయడానికి వచ్చిన రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి తులం బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి పట్టగొలుసులను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడిపై గతంలో నెక్కొండ, చెన్నారావుపేట తదితర పోలీస్ స్టేషన్లలో 9 కేసులు ఉన్నట్లు రుజువైందని సీఐ తెలిపారు. 24 గంటల్లోనే కేసును చేధించిన ఎస్సై రఘుపతి, హెడ్‌కానిస్టేబుల్ సార య్య, కానిస్టేబుల్స్ రాజు, రవికుమార్, సుమన్, హోంగార్డు ఎర్రయ్యలను సీఐ చంద్రమోహన్, ఎస్సై అభినందించారు.

బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు



బ్యాంకు ఎదుట క్యూ కట్టిన రైతులు

వర్ధన్నపేట, ఆగస్టు 24 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకంలో రెండవ విడతలో రూ.1.50 లక్షలు మాఫీ అయిన రైతులు రీ షెడ్యూల్ కోసం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుబారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. బ్యాంకు తీసే వేళ కంటే ముందే ప్రతీ రోజు 7 గంటల వరకే బ్యాంకు ముందు క్యూలైన్‌లలో నిలబడుతున్నారు. బ్యాంకు తెరవగానే ఒక్కసారిగా తాము ముందంటే తాము ముందని గుంపుగా గుమికూడడం, ఆలస్యంగా వచ్చిన వారు పైరవీలతో ముందుకు వెళుతుంటే తోపులాటలు జరుగుతున్నాయి. బ్యాంకు అధికారులు రుణమాఫీకి ప్రత్యేకంగా టోకెన్‌లు అందిసున్నా క్రమపద్ధతిలో వెళ్లక పోవడంతో తోపులాట జరుగుతుంది. దీంతో సాధారణ బ్యాంకు లావాదేవీలకు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా కమిటీల ఏర్పాటు

ఖిలావరంగల్, ఆగస్టు 24: జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కమిటీలను భారతీయ జనతాపార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌ల ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొలెపాక మార్టిన్ లూథర్ ప్రకటించారు. శనివారం 18వ, డివిజన్ లేబ ర్‌కాలనీలో జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి బన్నా ప్రభాకర్ అధ్యక్షతన కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులు నలిగంటి నర్సింగం, పొలెపాక జనార్దన్, జిలుకర వీరస్వామి, దామెర సదానందం, షైదం వీర స్వామి, చింతల నవీన్, తుల అనూష, జన్ను రవి, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా మాదాసు రాజు, ఉసిల్ల దయాకర్, తనుగుల అంబేద్కర్, ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శిగా నమిండ్ల కన్నయ్య, జిల్లా కార్యదర్శులుగా సూరం రాజు, సిలువేరు భాస్కర్, మంతెన అనిత, కంజర్ల విజయ్, ప్రవీణ్‌లను ప్రకటించారు.

మోడల్ పాఠశాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



అమీనాబాద్ మోడల్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట, ఆగస్టు 24: మోడల్ పాఠశాలలో విద్యార్థుల మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమీనాబాద్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసమయ్యే డనింగ్‌హాల్ నిర్మాణాలను రూ 30లక్షలతో చేపట్టుడం జరుతుందన్నారు, విద్యార్థులకు డిజిటల్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు డి.జిటల్ తరగతులల్లో విద్యా బోధన చేయటం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు, అలాగే విద్యార్థులకు అవసరమయ్యే మౌళిక వసతులను కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే పరిష్కరం చేస్తామన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనువాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మా.జీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దెన మల్లేష్, బండి బాలరాజ, యూత్ అధ్యక్షుడు బండి హరీష్, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్ , కుమారస్వామి పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్ బాధితుడికి రూ. 3.40లక్షల పరిహారం



బాధితుడు ఈశ్వర్‌కు చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, ఆగస్టు 24: విద్యుదాఘాతానికి గురైన బాధితుడికి ఆ శాఖాధికారులు రూ.3.40లక్షల పరిహారం శనివారం అందించారు. బాధితుడు, అధికారుల కథనం ప్రకారం. విశ్వనాథపురానికి చెందిన బాదావత్ ఈశ్వర్ అనే విద్యార్థి గ్రామ సమీపంలోని కాలువ వద్దకు ఆడుకునేందుకు గత సంవత్సరం అక్టోబరులో వెళ్లాడు. 11కేవీ విద్యుత్ స్తంభాల కింద కాలువ మట్టిపోయగా ఆ మట్టిపైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు అతడికి విద్యుత్ తీగెలు తాకి షాక్‌కు గురయ్యాడు. దాంతో అతడి కాలును తీసేశారు. ఈశ్వర్ తండ్రి సాంబయ్య విద్యుత్‌శా ఖ అధికారులను కలిసి తన కుమారుడికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విన్నవించాడు. శాఖపరమైన విచారణ జరిపిన అధికారులు ఈశ్వర్‌కు రూ. 3.40లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి బాధితుడికి ఎక్స్‌గ్రేషియా చెక్కును శనివారం ఆయన హన్మ కొండలోని ఆయన నివాసంలో అందచేశారు. విద్యుత్‌శాఖ ఏడీ నర్సింహరావు, డీఈ భిక్షపతి, ఏఈ సంపత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● బంగారు వెండి, ఆభరణాలు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24 : మానుకోట జిల్లా కేంద్రంతో పాటు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌లో దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు, వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన సంపంగి శేఖర్ రీకవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే మం డలానికి చెందిన పంజాల రాజేష్ రికవరీ ఏజెంటుగా పని చేస్తున్నాడు. ఈనెల 13న మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఇంట్లో తాళం పగలగొట్టి వెండి, బంగారు ఆభరణాలతో పాటు రూ. 10 వేలు అపహరించుకపోయినట్లు చెప్పారు. వారి జల్సాల కోసం రూ.10 వేలు వాడుకున్నట్లు వెల్లడించారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయనిపహాడ్‌లో ఇరువురితో పాటు సోడా శేఖర్‌తో కలిసి దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పు కున్నట్లు వెల్లడించారు. మిగిలిన వెండి బంగారు ఆభర ణాలను జిల్లా కేంద్రంలో విక్రయించేందుకు తాళ్లపూసపల్లి నుంచి ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వస్తుండగా మహర్షి పాఠశాల వద్ద వాహనాలు తనఖీలో వారు పట్టుబడినట్లు చెప్పారు. వెండి, బంగారు ఆభరణాలు, హోండా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బంగారు, వెండి ఆభ రణాల విలువ సుమారు రూ. 76,500 వరకు ఉంటుందన్నారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయనిపహాడ్‌లో ఇరువురితో పాటు సోడా శేఖర్‌తో కలిసి దొంగతనం చేసినట్లు నేరాన్ని అంగీకరిం చినట్లు వెల్లడించారు. సంపంగి శేఖర్, పంజాల రాకేష్‌ను అరెస్టు చేసి రిమాం డుకు తరలించినట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో సీఐ దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్, సీసీఎస్ ఎస్సై లింగయ్య, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారం

నర్సంపేట, ఆగస్టు 24 : రా ష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ 2లక్షల మేరకు రుణమాఫీ చేస్తుంటే జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు దండెం రథన్‌కుమార్ అన్నారు. రెండు లక్షల రుణమాఫీ జరగలేదంటూ బీఆర్ఎస్ నాయకులు గోడలకు అంటించి వాల్‌పోస్టర్లను శనివారం చించివేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణాలను మాఫీ చేస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ కాని రైతుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను మానుకోవాలని లేనిపక్షంలో రైతుల చేతిలో గుణపాఠం తప్పదని ఆయన అన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం



అంతరిక్ష ప్రయోగాలపై వివరిస్తున్న ప్రిన్సిపాల్ మల్లం నవీన్

నర్సంపేట టౌన్, ఆగస్టు 24 : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు శనివారం ముగిశాయి. మొదటి రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా డిల్లీలో ఇస్రో శాస్త్రవేత్తలు, అధికారులు ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమాలు, ప్రసంగాలను వర్చువల్ క్లాస్‌రూంలో ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా కళాశాల విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు వీక్షించారు. చంద్రయాన్-3 పై కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు బైరి సత్యనారాయణలు విద్యార్థులకు భారత అంతరిక్ష పరిశోధన, ప్రయోగాలు, కృత్రిమ ఉపగ్రహాల వైఫల్యాలు, విజయాలు, రాకెట్ల తయారీ, చంద్రయాన్-1, 2, 3 వరకు విషయాలను వివరించారు. ముగింపు రోజు శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవంపై ఆన్‌లైన్ క్విజ్, 10 పదాలు రాసే ధారణ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, ఎస్.కమలాకర్, రహీమొద్దిన్, రాంబాబు, సోమయ్య, రాజీరు, రజిత, రుద్రాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా ఆర్ఓఆర్ ముసాయిదా చట్టం

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 24: ప్రజలు, రైతులకు ఉపయోగంగా ఉండేలా ఆర్ఓఆర్ ముసాయిదా చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో రాష్ట్రాలు భూ చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి తీసుకొస్తున్న కొత్త ఆర్ఓఆర్ చట్టం భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం నూతన ఆర్ఓఆర్ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వాహణ పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో విస్తృతంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తగు సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు. నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలను రెండు మూడు రోజుల్లో కలెక్టర్ కార్యాలయంలో అందిస్తే వాటిని ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి తుది చట్ట రూపకల్పన కోసం ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అదనపు జాయింట్ కలెక్టర్ విఠల్, విశ్రాంత రెవెన్యూ అధికారి సురేశ్ కోఠార్, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీనియర్ సైంటిస్ట్ మల్లేశం, ప్రభుత్వ ప్లీడర్ నర్సింహారావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవన్‌గౌడ్, సెక్రటరీ మదస్సిర్ అహ్మద్, విద్యాసాగర్, తహసీల్దార్లు, న్యాయవాదులు, రైతులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగా చాంపియన్ షిప్‌లో విద్యార్థి ప్రతిభ

చెన్నారావుపేట, ఆగస్టు 24: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గుండ్లపల్లి ఉమా-రాజేంద్రప్రసాద్‌ల కూతురు సాత్విక జిల్లా స్థాయిలో చాంపియన్ షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇటీవల జిల్లా స్థాయిలో యోగాసేనా ఛాంపియన్ షిప్ -2024 ఉత్తమ ప్రతిభ కనబర్చిన సాత్విక రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. శనివారం ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులతో పాటు , గ్రామస్తులు విద్యార్థిని సాత్వికను అభినందించారు.

సీఐని కలిసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

రాయపర్తి, ఆగస్టు 24 : నూతన వర్ధన్నపేట సీఐగా బాధ్యతలు చేపట్టిన కొమ్మూరి శ్రీనివాస్‌ను శనివారం తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, సూర్యతండా అధ్యక్షుడు బనీషా నాయక్, మాజీ సర్పంచ్ మాంజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి, ఐనవోలు ఆలయాలకు ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 24: భద్రకాళి, ఐనవోలు ఆలయాలకు ట్రస్టు బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని 26ఆలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం చేపట్టాలని ప్రభుత్వం గత రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. 26దేవాలయాల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెండు దేవాలయాలు ఉన్నాయి. ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దేవాలయం ట్రస్టు బోర్డు, శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భద్రకాళి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేశారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయలేదు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం బోర్డుల ఏర్పాటు చేయాలని నోటిఫికేషన్ జారీ చేసింది. భద్రకాళి దేవస్థానం ట్రస్టు బోర్డు ఏర్పాటులో 14 మందితో కూడిన ట్రస్టు బోర్డు ఉంటుంది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈవో ఉంటారు. ఇందులో వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్న వారు చైర్మన్, ఒక మహిళ, 12మంది ధర్మకర్తల మండలి సభ్యులుగా ఉంటారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

చెన్నారావుపేట, ఆగస్టు 24: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో విద్యా శాఖ వారి ఆధ్వర్యంలో శనివా'రం వారధి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన ఉపన్యాస పోటీలకు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 14మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనటం జరిగింది. వారిలో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని జిల్లా స్థాయిలోను పోటీలను నిర్వహించటం జరుగుతుందని ఎంఎస్‌వో సరళ తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయలు. సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, ఆగస్టు 24 : మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరభద్రరావు తల్లి శ్రీరామమ్మ మృతిచెందగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డిలు భాదిత కుటుంబాన్ని పరామర్శించారు. వీరి వెంట నాయకులు కందికట్ల యాకయ్య, నర్సింహరావు, మాధవరావు, చిర్ర నాగరాజు, కుమార్, రంగారావు తదితరులు ఉన్నారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్స్‌కు భూములిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు

సంగెం, ఆగస్టు 24: కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్‌లను కేటాయింపు చేస్తూ అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులపై పేర్లను శనివారం అంటించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా నోటీస్ బోర్డులపై అంటించడంతో పేర్ల కోసం గ్రామపంచాయతీలకు పరుగులు తీస్తున్నారు .సంగెం- గీసుగొండ మండలాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న టెక్స్‌టైల్స్ పార్కు కోసం భూములు ఇచ్చిన రైతాంగంకు వంద గజాల స్థలంను కేటాయిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. చింతపల్లి, వంజరపల్లి, కృష్ణనగర్, సంగెం, కుంటపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ పేర్లను సరిచూసుకున్నారు.

28నుంచి ఎల్గూరురంగంపేటకు బస్సు సర్వీసులు

సంగెం, ఆగస్టు 24: మండలంలోని ఎల్గూరురంగంపేట గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్దరించారు. ఈ నెల 28 నుంచి నడపాలని అధికారుల సమీక్ష సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. దీంతో బుధవారం నుంచి వరంగల్ నుంచి గ్రామం వరకు నాలుగు ట్రిప్పులను నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు పలకల పంపిణీ

గీసుగొండ, ఆగస్టు 24: ధర్మారం అంగన్‌వాడీ సెంటర్ పిల్లలకు పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు ఎలిగేటి కిష్టయ్య తన మనవరాలి పుట్టినరోజు సందర్భంగా శనివారం పలకలు, పండ్లను అందచేశారు. మనోజ్, కేయూ దూరవిద్యా కేంద్రం కోఆర్డినేటర్ శ్రీకాంత్, గట్టికొప్పుల రమేష్, మల్లేశం అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఖతమైంది.. దేవాదుల దూరమైంది

● సాగు నీరు లేక రైతులు విలవిలలాడుతున్నారు ● సీఎం రేవంత్‌రెడ్డివి బోగస్ మాటలు ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజం



కాపుల కనపర్తిలో ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, రైతులు

సంగెం, ఆగస్టు 24 : కాళేశ్వరం ప్రాజెక్టు రావాల్సిన నీరు రావడం లేదని, గ్రామల్లో చెరువుల్లోకి దేవాదుల నుంచి రావాల్సిన నీరు అందడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పుణ్యాన కాళేశ్వరం ఖతమైందని, దేవాదుల రైతులకు దూరమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. శనివారం కాపులకనపర్తిలో సొసైటీ ఎదుట ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలు మాట్లాడుతూ కాపులకనపర్తి సొసైటీలో వంద శాతం రుణాలు మాఫీ కాలేదన్నారు. బ్యాంకర్లు ఆరునెలల కిందనే రిపోర్టులు పంపించినా కావాలని బ్యాంకర్లపై ప్రభుత్వం అబద్దాలు చెపుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హరీశ్‌రావు చేసిన సవాల్‌కు భయపడి ఆగమేఘాల మీద అసంపూర్తిగా రుణమాఫీ చేశారని ఆరోపించారు. ఆగస్టు 15తేదీ వరకు చేయకపోతే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని అనడంతో సర్కారుకు భయం పుట్టిందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని గుళ్లమీద ప్రమాణాలు చేసి పార్లమెంటు ఎన్నికలు వాడుకున్నారని ఆరోపించారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకున్న ముఖ్యమంత్రి మాట తప్పినందుకు రాజీనామా చేయకుండా, రైతులకు క్షమాపణ చెప్పి, దేవుళ్ల దగ్గరకు వెళ్లి తప్పు చేశానని ఒప్పుకోవాలన్నారు. ఎన్నికల ముందు రూ.46 వేల కోట్లని, క్యాబినెట్‌లో రూ.26వేల కోట్లని, మాఫీ చేసింది రూ.17వేల కోట్లని తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆరోపించారు. ఈనెల 30 తేదీ వరకు రుణమాఫీ చేయకపోతే పోరాటాన్ని ఉధృతి చేస్తామన్నారు. ఎరువులు, నీరు, కరెంటు కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. సీఎంరేవంత్ రెడ్డి బోగస్ మాటలు బంద్ చేసి రైతులను ఆదుకోవాలని, సీఎం హుందా తనాన్ని దెబ్బతీసేలా విధంగా మాట్లాడుతున్నారని, ఇష్టమొచ్చినట్లు కేసీఆర్‌ను, కేటీఆర్‌ను, హరీశ్‌రావులను తిట్టడం హేయమైన చర్యన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, మాజీ సీఎం కేసీఆర్‌పై కేసులు వేసేందుకు మాత్రం తీరిక ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ బూర సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పి.సారంగపాణి పాల్గొన్నారు.